ఆంధ్రప్రభ 10-6-99

# ఇది కేవలం సరిహద్దు సమస్య కాదు



దేశమంతటిలోకీ ఒక్క కాశ్మీర్‌లో మాత్రమే ప్రజలీ రోజు ప్రపంచ కప్ క్రికెట్ కంటే యుద్ధాన్ని గురించి ఎక్కువ చర్చించుకుంటున్నారని ఒక కాశ్మీర్ దిన పత్రిక ఈ మధ్య కొంచెం వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. నిజమే మరి — వాళ్ళకు 1947 కాకున్నా 1965, 1971 బాగానే జ్ఞాపకం ఉన్నాయి. తక్కిన భారత — పాకిస్తాన్ ప్రజానీకానికి ఆ యుద్ధాల జయాపజయాలు మాత్రమే జ్ఞాపకం ఉండవచ్చు కానీ కాశ్మీరీలకు యుద్ధ అనుభవం జ్ఞాపకం ఉండక తప్పదు. పైగా 1947, 1965 యుద్ధాలలో కాశ్మీర్ ప్రధాన విషయం కాగా 1971 యుద్ధంలోనూ అది ఇరు దేశాల యుద్ధ లక్ష్యంలో ఒక అంశమే. కాశ్మీర్‌ను పాకిస్తాన్ నుండి 'రక్షించ' డానికి భారత ప్రభుత్వం, భారత్ నుండి 'విముక్తి' చేయడానికి పాకిస్తాన్ ప్రభుత్వం యుద్ధ రంగంలోకి దిగాయి. సగటు కాశ్మీరీలు దానిని ఆ కళ్ళతోనూ చూడరు. ఈ కళ్ళతోనూ చూడరు. అయినప్పటికీ యుద్ధం పర్యవసానాలను వారే ఎక్కువ భరించవలసి రావడం కాశ్మీరీల ఆధునిక చరిత్రలోని విషాదానికొక మచ్చుతునక.

గతంలో కంటే ఇప్పుడు భయం ఎక్కువ ఉండడానికి కారణం అణు బాంబులు. నిజానికి కాశ్మీర్ ప్రజలే కాదు. దేశం యావత్తు ఈ సారి యుద్ధ ప్రమాదాన్ని గురించి మరింత ఎక్కువ భయపడడానికి కారణం, ఈసారి యుద్ధం అంటూ వస్తే అది అణు యుద్ధంగా మారగల ప్రమాదమే. ఇరు దేశాలలోనూ ఈ ఆదుర్దాలను పెంచిన ఘనత మన పాలకులదే. అణు యుద్ధంలో గెలుపు ఓటములు ఉండవు. చెప్పుకోడానికి ఒకరు గెలిచిన వారు, ఒకరు ఓడిన వారు ఉంటారు కానీ నిజానికి ఉండేది సార్వత్రిక విధ్వంసమే.


భారత్‌తో యుద్ధం చేసి గెలవడం తనకింక సాధ్యం కాదన్న అభిప్రాయానికి పాకిస్తాన్ 1971 యుద్ధం తరువాత వచ్చింది. ఇప్పుడు అణు బాంబులు వచ్చిన తరువాత కూడా పాకిస్తాన్ 'గెలవ' లేకపోవచ్చు. కానీ గెలుపు ఓటములు లెక్క పెట్టుకోవడానికి — అణు యుద్ధమంటూ వస్తే — ఇరువైపులా ఎక్కువ మిగలక పోవచ్చు. మన పాలకుల మితిమీరిన హైందవ జాతీయ వాదం రెండు దేశాలలోనూ ఇక్కడికి తీసుకువచ్చింది.

అందుకే 'చొరబాటుదారుల' సమస్యను వీలయినంత తక్కువ ఆర్భాటంతో పరిష్కరించుకోవడం మంచిది. ఇదేదో కొత్తగా మొదలయిన సమస్య కాదు. 1947 లో పాకిస్తాన్ ప్రాంతం నుండి 'చొరబాటుదారులు' జమ్మూ — కాశ్మీర్‌లోకి ప్రవేశించడంతో 'కాశ్మీర్ సమస్య' అనేది మొదలయింది. ఆ 'చొరబాటుదారులు' ఆనాటి నుండి ఈనాటిదాకా తమను తాము విముక్తి పోరాటకారులుగానే భావించుకుంటున్నారు. ఆనాటి నుండి ఈనాటిదాకా వారిలో పాకిస్తాన్ సైనికులు కొందరు అనధికారికంగా (అంటే వారిపై అధికార్లకు తెలియకుండా అని కాదు) ఉంటూనే ఉన్నారు.

1965 లో కూడా 'చొరబాటుదారులు' అని మన ప్రభుత్వం పిలిచేవారి ప్రవేశంతోనే యుద్ధం మొదలయింది.

1989 నుండి ఈనాటి దాకా ఆ రాష్ట్రంలో సాగుతున్న మిలిటెన్సీకి అండగా 'చొరబాటుదార్లు' ప్రవేశిస్తూనే ఉన్నారు. మొదట కాశ్మీర్ లోయలోని సరిహద్దు జిల్లాలయిన బారాముల్లా, కుప్వారాలలోకి ప్రవేశించడం మొదలు పెట్టారు. తర్వాత జమ్మూ ప్రాంతంలోని రాజోరి, పూంచ్ సరిహద్దులగుండా ప్రవేశించారు. ఆ తర్వాత పీర్ పంజల్ కొండల మీదుగా దోడా జిల్లాలోకి రావడం మొదలయింది. ఇప్పుడు అన్నింటి కంటే కష్టతరమైన కార్గిల్ సరిహద్దు మీదుగా ప్రవేశిస్తున్నారు. పది సంవత్సరాలుగా భారత సైన్యం ఏ ఆర్భాటం లేకుండా వాళ్ళను వెనక్కి తరిమే ప్రయత్నం చేస్తూనే ఉంది. ఒక్కొక్కసారి విజయం సాధించింది. ఒక్కొక్కసారి అపజయం పాలయింది. కానీ ఎప్పుడూ లేనిది ఇప్పుడింత ఉద్రేకం ఎందుకు ? దేశ ప్రజలంతా చొరబాటుదారులను ఎదుర్కోవడంలో నిమగ్నం కావాలన్న ఈ ఆవేశం ఎందుకు ? బి. జె. పి. కి రాబోయే ఎన్నికలలో ఈ వాతావరణం బాగా ఉపయోగపడుతుందనుకోండి. కానీ దేశమంతా ఉద్రేక పడడం ఎందుకు ?

ఉద్రేకం ఎందుకువద్దంటే ఈ చొరబాటుదారులంతా భారత సైన్యం తాకిడికి తట్టుకోలేకపారిపోయినా, లేక మన వాళ్ళంతా చాలా ఉద్విగ్నతతో డిమాండ్ చేస్తున్నట్టు భారత సైన్యం వాళ్ళందరినీ చంపేసినా 'చొరబాటు దారుల' సమస్య అంతమయిపోదు. వాళ్ళను ఆహ్వానించడానికి కాశ్మీర్ లోయలోని ప్రజలు సిద్ధంగా ఉన్నంత కాలం అది అంతమయిపోదు. భారత సైన్యాన్ని తప్పించుకోవడం ఈ చొరబాటుదారులకు కష్టం కావచ్చు, కానీ లోయలోకి ప్రవేశిస్తే దాదాపు ఏ ఇంట్లోనయినా వారికి ఆశ్రయం దొరుకుతుంది. ఈ సంసిద్ధతను 'దేశ ద్రోహం' గా అర్థం చేసుకునేటట్టయితే 'చొరబాటు' దారులనందరినీ చంపేయమని ఆవేశపడినట్టే కాశ్మీరీలందరినీ చంపేయమని ఆవేశపడడం తప్ప చేయగలిగిందేమీ ఉండదు.



ఈ సంసిద్ధత వెనుకనున్నది చాలా లోతయిన చారిత్రక, రాజకీయ కారణాలున్న వైమనస్యం అని అర్థం చేసుకున్నట్టయితే 'చొరబాటు' దారులకు ఆశ్రయం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న కాశ్మీరీలపైన గానీ, 'చొరబాటు' దార్లపైగానీ రెచ్చిపోయి ఏమీ ప్రయోజనం లేదని అర్థం అవుతుంది. భారత ప్రభుత్వం, పత్రికలు ఈ 'చొరబాటు' దారులను కిరాయి గుంపులు అని అభివర్ణించడం జరుగుతుంటుంది కానీ వారు కిరాయి మూకలు కారు. పాన్ ఇస్లామిక్ ప్రాపంచిక దృక్పథం ఉన్న మత రాజకీయ మిలిటెంట్లు. ఆ దృక్పథం ఒక రకమైన ఉన్మాదం అనడంలో సందేహం ఏమీ లేదు. అయినప్పటికీ సిద్ధాంత విశ్వాసాల నుండి పుట్టిన మిలిటెన్సీని కేవలం సైనిక బల ప్రయోగంతో అంతమొందించడం అసాధ్యం. దాని సామాజిక పునాదిని దూరం చేయగలిగితేనే దానిని జయించడం సాధ్యమవుతుంది. అది సాధ్యం కాక బల ప్రయోగాన్ని విపరీత పరిమాణంలో కొనసాగించడం దానికి పరిష్కారం అన్న తప్పుడు అభిప్రాయంతో సాగితే ఆ మిలిటెంట్లకు ఎంత హాని జరుగుతుందో ఏమో గానీ వారి సామాజిక పునాది అయిన జనానికి మాత్రం చాలా హాని జరుగుతుంది. ఆ సామాజిక పునాదిలోని జనం ఏదో ఒక వైమనస్యానికో, అసంతృప్తికో లోనయిన వారు. వారికి బలప్రయోగం ఎట్టి పరిస్థితిలోనూ జవాబు కారాదు.

కాశ్మీరీలది నిజానికి చాలా విషాదకరమైన పరిస్థితి. ఇస్లామిక్ మతోన్మాదం ప్రభావం కాశ్మీరీలపైన ఏమంత ఎక్కువ లేదు. 1946—47 సంవత్సరాలలో దేశమంతా మత ఘర్షణలతో అట్టుడికిపోతున్న తరుణంలో కూడా, కాశ్మీర్‌లో ఒక్క హిందువు తల వెంట్రుకను సైతం 95 శాతంగా ఉన్న ముస్లింలు ముట్టుకోలేదని గాంధీ ప్రశంసించాడు.

1989 లో మిలిటెన్సీ మొదలయిన తరువాత కూడా స్వతంత్ర కాశ్మీర్ లక్ష్యాన్ని వ్యతిరేకించిన వారి పైన — హిందువుల పైన, ముస్లింలపైన కూడా — దాడులు జరిగాయేకానీ కాశ్మీర్ మిలిటెన్సీ విదేశీ పాన్ ఇస్లామిక్ మిలిటెంట్ల చేతిలోకి పోయేదాకా హిందువులను కేవలం హిందువులుగా చంపినన ఘటనలు జరగనేలేదు. పాకిస్తాన్‌లో చేరాలన్న కోరిక కూడా కాశ్మీర్‌లో మెజారిటీ అభిప్రాయం కాదు. అయినప్పటికీ ముస్లిం మత రాజకీయ మిలిటెంట్లయిన ఈ 'చొరబాటుదారుల' కు కాశ్మీర్‌లో ఆశ్రయం ఎందుకు దొరుకుతుందంటే 'భారత్' మీద వేయడానికి ఏ రాయి అయితేనేం అన్న అభిప్రాయం కాశ్మీరీలలో బలంగా ఉండడం దానికి కారణం. అయితే ఈ రాయికీ వాళ్ళకూ మధ్య ఉన్న ఎడం ఎంతటిదంటే నిర్దయగా బల ప్రయోగం చేసే మతతత్త్వ వైఖరి, అత్యాధునిక ఆయుధ సంపద ఉన్న పాక్ ఇస్లామిక్ మిలిటెంట్లు ఈ పది సంవత్సరాలలోనూ స్త్రీలెవ్వరూ బురఖాలు లేకుండా వీధిలోకి రాకూడదన్న తమ ఆదేశాన్ని కాశ్మీర్‌లో అమలు చేయలేక పోయారు. ఒంటరిగా ఉన్నప్పుడు కాశ్మీరీలు వీరి మూర్ఖత్వాన్ని గురించి విసుక్కుంటూ మాట్లాడతారు. కానీ భారత సైన్యం మీద యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్న 'ముజాహిద్' లుగా మరొక పక్క గౌరవిస్తారు. ఆశ్రయం ఇస్తారు. అందువల్ల వచ్చే క్రూరమైన నిర్బంధాన్ని, సైన్యం చేతిలో చిత్రహింసలనూ భరిస్తారు.

గత పది సంవత్సరాలుగా కాశ్మీర్‌లోని సైనిక అధికారులు చేసిన ప్రకటనలు చూస్తే ఏ రోజూ అక్కడ మిలిటెంట్లు మూడు నాలుగు వేల మంది కంటే ఎక్కువ లేరని అర్థం అవుతుంది. అందులో కాశ్మీరీ మిలిటెంట్ల సంఖ్య కాలక్రమంలో తగ్గి 'చొరబాటుదార్ల' సంఖ్య పెరుగుతూ ఇప్పుడదే మెజారిటీగా ఉంది. ఈ మూడు నాలుగు వేల మందిని ఎదుర్కోవడానికి కాశ్మీర్‌లో ఒక్కొక్క దశలో మూడు లక్షల నుండి 5 లక్షల దాకా భారత సైన్యం మోహరించబడి ఉంది. అయినప్పటికీ మిలిటెన్సీ అణగారిపోలేదు. కాశ్మీర్‌లోని మిలిటెంట్ల సంఖ్య ఏ దశలోనూ (భారత సైనిక అధికారుల లెక్కల ప్రకారమే) మూడు నాలుగు వేలు మించి లేకపోయినా ఇప్పటికీ కాశ్మీర్‌లో భారత సైన్యం చేతిలో చనిపోయిన వారి సంఖ్య ఎంత తక్కువనుకున్నా 20 వేలు ఉంటుంది. (కాశ్మీరీ పోరాటకారులు 40 వేల మంది అమరులయ్యారంటారు). అంటే ఎక్కువగా ఆ మిలిటెంట్ల సామాజిక పునాది అయిన సామాన్య కాశ్మీరీలను చంపుతున్నారని అర్థం. అయినప్పటికీ మిలిటెన్సీ అణగారిపోలేదు.

ఇప్పుడు కార్గిల్ సరిహద్దు దాటిన 'చొరబాటుదారు' లందరినీ చంపి తీరాల్సిందేనని ఆవేశపడి ఏం ప్రయోజనం ? వెనక్కి వెళ్ళి పోవడానికి సిద్ధంగా ఉన్న వాళ్ళను వెళ్ళిపోనిచ్చి ఈ ఉదంతానికి ముగింపు పలకాలన్న ప్రతిపాదన మీద (జార్జి ఫెర్నాండెజ్ లేక లేక చేసిన ఒక తెలివయిన ప్రతిపాదన) అందరూ విరుచుకుపడడం ఎందుకు ? ఇప్పుడు సరిహద్దు కొత్తగా దాటిన వాళ్ళందరినీ చంపేసినా చంపేయకపోయినా కాశ్మీర్ పరిస్థితిలో అవగింజంతయినా తేడా రాదు. వాళ్ళందరినీ చంపేయాల్సిందేనన్న పట్టుదల పాకిస్తాన్‌తో యుద్ధానికి దారితీస్తే మాత్రం ఎవ్వరికీ మంచిది కాదు. మొదట్లో చెప్పినట్టు అణు బాంబులు ఇద్దరిదగ్గరా ఉన్న ప్రస్తుత పరిస్థితులలో గెలుపు ఓటములు ఉండవు. విధ్వంసం మాత్రమే ఉంటుంది.

మరి దీనికి అంతెప్పుడు ? వాళ్ళు చొరబడడం, మనం బయటికి సాగనంపడం అనంతంగా జరుగుతూ ఉండవలసిందేనా ? అని ఆవేశపడి ప్రయోజనం లేదు. కాశ్మీర్ సమస్య మన పాలకుల స్వయంకృతం. ఆర్టికల్ 370 ని నిజాయితీగా అమలు చేసి కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని ఇతర రాష్ట్రాలలో గౌరవించిన మేరకయినా గౌరవించి ఉంటే కాశ్మీర్ పరిస్థితి ఇక్కడి దాకా వచ్చేది కాదు. ఇప్పుడు జాతీయవాద ఉద్రేకంలో సులభ పరిష్కారం వెతుక్కుందామంటే దొరకదు. 1952 నాటి ఢిల్లీ ఒడంబడికను పునరుద్ధరించి ఆ తర్వాత కాశ్మీర్ విషయంలో చేసిన శాసన సంబంధమైన మార్పులన్నింటినీ రద్దు చేసి కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని ఒక రెండు మూడేళ్ళయినా గౌరవించి చూపిస్తే కాశ్మీరీలు భారత దేశంలోనే ఉండడాకి సిద్ధపడతారేమో. అప్పటికీ సిద్ధపడకపోతే వారు స్వతంత్రంగా బతికే హక్కును గౌరవించడం న్యాయంగా ఉంటుంది. మనం తరచుగా గొప్పలు చెప్పుకునే అత్యున్నత నాగరికతా ప్రమాణాలకు తగినట్టుంటుంది.

ఇదంతా ఒకెత్తయితే కార్గిల్ వాసులది మరీదయనీయమైన స్థితి. కాశ్మీర్ లోయ ప్రజల స్వతంత్రేచ్ఛతో కార్గిల్ వాసులకేమీ సంబంధం లేదు. 'చొరబాటుదారుల' కు పైన చెప్పిన కారణాల వల్ల కాశ్మీర్ లోయలో ఆశ్రయం దొరుకుతుంది కానీ కార్గిల్‌లో దొరకదు. అత్యధికంగా షియా ముస్లింలయిన కార్గిల్ వాసులకు ఈ సున్నీ మతవాద మిలిటెంట్లంటే ప్రేమలేదు. సున్నీ ఇస్లాంను అధికార మతంగా కలిగిన పాకిస్తానంటే అసలే లేదు. అట్లాగని భారత దేశం పట్ల కూడా పెద్దగా అభిమానం లేదు. ఏ అభివృద్ధికీ నోచుకోకుండా విసిరి వేయబడ్డట్లు ఎత్తయిన మంచు ఎడారిలో బతుకుతున్న ఆ ప్రజలకు మన ఆవేశం, పాకిస్తాన్‌ల ఆవేశం వికారంగా కనిపించక మానదు. ద్రాస్ పట్టణవాసులు ఆ ఊరిని ఖాళీ చేసి వెళ్ళిపోయారు. కార్గిల్ పట్టణం దాదాపు మూడేళ్ళుగా పాకిస్తానీ తుపాకీ గుండ్ల విధ్వంసాన్ని రుచి చూస్తున్నది. తాము షియాలు కాబట్టే పాకిస్తాన్ విచ్చలవిడిగా తుపాకీ గుండ్లు కురిపిస్తున్నదని ఒక వైపు, భారత ప్రభుత్వానికి కార్గిల్ కేవలం సియాచిన్‌కు దారితీసే ఒక సరిహద్దు ప్రాంతమే తప్ప భారత పౌరులుండే ప్రాంతం కాదని మరొకవైపు కార్గిల్ ప్రజలు చేసే విమర్శ గత రెండేళ్ళుగా కాశ్మీరీ పత్రికలలో క్రమం తప్పకుండా కనిపిస్తుంది.

'కాశ్మీర్ సమస్య' లోని అతి ముఖ్యమైన సమస్య ఏమిటంటే అది కేవలం ఒక సరిహద్దుకాదని అక్కడ మనుషులున్నారని వారికి భిన్న మనోభావాలూ, దృక్పథాలు, కోరికలూ ఉన్నాయనీ ఇటు ఇండియాలో గానీ, అటు పాకిస్తాన్‌లో కానీ ఎవరూ గుర్తించకపోవడం. ఈ గుడ్డి దేశ భక్తికి వారిని ఎన్ని రోజులింకా బలిపెడదాం ?

— కె. బాలగోపాల్